ఇవి తొండల గుడ్లు కావు.. పంట ధాన్యపు గింజలు

ఇది పచ్చని పల్లి తోట | పులిచర్లకుంటలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంట

ఆసాంతం వరి పంటలే.. | పులిచర్లకుంటలో రైతులు సాగు చేస్తున్న వరి పంట

ఇది కోతకు వచ్చిన పైరు | రోటిబండతండాలో కోతకు వచ్చిన వరిపైరును చూపుతున్న మహిళా రైతు

ఫార్మాపై ప్రశ్నించే గొంతుకలు..

గళమెత్తిన చిచ్చరపిడుగులు

ఈ ఇద్దరమ్మాయిల్లో ఒకరు మంజుల, మరొకరు పూజ.. రాష్ట్రవ్యాప్తంగా లగచర్ల ఘటన సంచలనం రేపుతుంటే ఎక్కడ చూసినా ఈ ఇద్దరి గురించే చర్చ జరుగుతున్నది. విద్యార్థి దశలోనే సాక్షాత్తు సీఎంను ఎదురిస్తున్నారు. ఫార్మా కంపెనీ మాకొద్దంటూ ఓ తండా గొంతుకై ప్రశ్నిస్తున్నారు. ఈ అమ్మాయిల ప్రశ్నలకు ఆఫీసర్లు, ఎస్టీ కమిషన్ బృందంతోపాటు రాజకీయ నేతలూ జవాబివ్వలేకపోతున్నారు. మంజుల డిగ్రీ చదువుతుండగా, పూజ ఇంటర్ పూర్తిచేసుకొని నీట్‌కి ప్రిపేర్ అవుతున్నది. లగచర్ల ఘటన తర్వాత వీరిద్దరూ రోటిబండతండాలో గ్రామస్తులతో గళం కలిపి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. తండాకు వచ్చే ప్రతి ఒక్కరిని ఫార్మాపై నిలదీస్తూ గ్రామస్తుల గొంతుకయ్యారు. సీఎంను, ఆయన అన్న తిరుపతిరెడ్డిని కడిగిపారేస్తున్నారు. మా ప్రాణాలు పోయినా లెక్కచేయం.. మా సమాధులపై శంకుస్థాపనలు చేసుకోండి అంటూ ఖరాఖండిగా చెబుతున్నారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలకు చదువుకునే వయసులోనే సమాధానంగా నిలుస్తున్నారు. హ్యాట్సాఫ్ మంజుల, పూజ.

రోటిబండతండాలో వేరుశనగ, వరి పంటను చూపుతున్న మంజుల, పూజ

ఇది తెల్ల బంగారమే.. | లగచర్లలో పత్తిని ఏరుతున్న రైతులు, కూలీలు

రోటిబండతండాలో సాగవుతున్న వేరుశనగ పంటను చూపుతున్న మహిళా రైతు



ఈ నీరు పంటలకే.. | పులిచర్లకుంటలో సాగవుతున్న పంటలకు బోరుబావి నుంచి వెళ్తున్న నీరు

లోకం పోకడ

లగచర్ల ఉదంతంపై హక్కుల కమిషన్ సీరియస్

మొదటిపేజీ తరువాయి...

పరిశీలన కోసం తమ అధికారుల బృందాన్ని లగచర్లకు పంపించాలని నిర్ణయించింది. లగచర్లలో భూసేకరణ విషయంలో ప్రభుత్వం అనుసరించిన తీరును తీవ్రంగా ఆక్షేపించింది. హింసకు గురైన బాధితులలో చాలామంది ఎస్సీ, ఎస్టీ, వెనుకబడినవర్గాల వారేనని గుర్తించింది. పోలీసుల వేధింపులతో గ్రామస్తులు తమ ఇళ్లను వదిలి సమీప అడవులు, వ్యవసాయ క్షేత్రాల్లో తాత్కాలిక ఆశ్రయం తీసుకున్న విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. బాధితులకు ఆహారం, వైద్యసాయం వంటి కనీస సౌకర్యాలు కూడాలేవన్న విషయం కమిషన్ దృష్టికి వచ్చింది.

ఫిర్యాదుపై స్పందించిన కమిషన్

ఈ నెల 11న అర్ధరాత్రి పోలీసులు, ఇతరులు తమపై సాగించిన దమనకాండపై వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామ ప్రజలు చేసిన ఫిర్యాదుపై మానవ హక్కుల కమిషన్ స్పందించింది. బాధితులలో చాలామంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారుండగా.. వారిలో 12 మంది బాధితులు కమిషన్‌ను ఆశ్రయించి తమను రక్షించాలని కోరారు. ప్రతిపాదిత 'ఫార్మా విలేజ్' కోసం భూమిని సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన తరువాత చోటుచేసుకున్న పరిణామాలను ఫిర్యాదులో వివరించారు. వందలాది పోలీసులు, స్థానిక గూండాలు గ్రామంపై దాడి చేసి, ఆందోళన చేస్తున్న గ్రామస్తులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనలో మహిళలు, గర్భవతులు గాయపడ్డారని వివరించారు. కరెంట్ తీసేసి, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి తమపై దమనకాండను సాగించిన పోలీసులు తిరిగి తమపైనే తప్పుడు కేసులు బనాయించి అక్రమ అరెస్టులు చేశారని తెలిపారు. దీంతో భయాందోళనకు గురైన గ్రామస్థులు ఇండ్లను వదిలి సమీపంలోని వ్యవసాయ భూముల్లో తాత్కాలిక ఆశ్రయం పొందారని వివరించారు.

రెండువారాల్లో నివేదిక ఇవ్వండి

లగచర్ల ఉదంతంపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించింది. ఎఫ్ఐఆర్‌ల స్థితి, కస్టడీలో ఉన్న వ్యక్తుల వివరాలు, భయంతో ఊరు వదలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్నవారి వివరాలను ఇవ్వాలని ఆదేశించింది. బాధితులకు, ప్రత్యేకించి మహిళలకు వైద్య పరీక్షలు జరిగాయా? గాయపడిన గ్రామస్థులకు వైద్య సహాయం అందిందా? లేదా? వంటి వివరాలను సైతం తెలియాలని స్పష్టం చేసింది. తక్షణమే దర్యాప్తు అధికారుల బృందాన్ని సంఘటన స్థలానికి పంపుతున్నామని, వారంలో ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆ బృందాన్ని ఆదేశించినట్టు తెలిపింది.

25న లగచర్లకు ఎస్సీ, ఎస్టీ కమిషన్

సంగారెడ్డి జైలుకూ వెళ్లనున్న కమిషన్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈ నెల 25న వికారాబాద్ జిల్లా లగచర్లలో పర్యటించనున్నది. లగచర్ల ఘటనపై క్షేత్రస్థాయిలో విచారించనున్నది. ఈ మేరకు కమిషన్ పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, డీజీపీకి కమిషన్ కార్యాలయం గురువారం ఆదేశాలను జారీచేసింది. ఉదయం లగచర్ల గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడనున్నది. అనంతరం సంగారెడ్డి జిల్లా జైలులో ఉన్న రైతులను కలిసి వివరాలను తెలుసుకోనున్నది. ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ అంశం వివాదాస్పదంగా మారడం, గిరిజనులపై ఇష్టారీతిన పోలీసులు దాష్టీకానికి పాల్పడటం తెలిసిందే. ఈ ఘటనపై రైతులను అరెస్టు చేసి సంగారెడ్డి జైలులో రిమాండ్‌లో ఉంచారు.



యూట్యూబ్ చానల్ విలేకరికి వచ్చిన బెదిరింపు లేఖ

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయొద్దు

లేదంటే ఇబ్బందులు తప్పవు

యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌కు బెదిరింపు లేఖ

నారాయణపేట, నవంబర్ 21 : 'రేవంతన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే కొడంగల్ మీడియాకు ఇబ్బందులు తప్పవు.. ఇందుకు మీరే బాధ్యులు.. ఫార్మా కంపెనీ వీడియోలు మీకు అవసరమా?' అంటూ అజ్ఞాత వ్యక్తి నారాయణపేట జిల్లా కోస్గికి చెందిన ఓ యూట్యూబ్ చానల్ రిపోర్టకు బెదిరింపు లేఖ రాశాడు. ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. కోస్గి రిపోర్టర్‌గా కొనసాగుతున్న సదరు వ్యక్తి పట్టణంలోని ఓ హోటల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపిన సమయంలో ఎవరో అందులో లేఖను వదిలివెళ్లారు. బైక్ ట్యాంకు కవర్‌ను తెరిచి చూడగా అందులో లేఖ కనిపించింది.

బీఆర్ఎస్ ధర్నాకు హైకోర్టు అనుమతి

25న 11 నుంచి 2 గంటల వరకే

వెయ్యి మందిలోపే పాల్గొనాలని ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్21 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఈ నెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ధర్నా నిర్వహించుకోవడానికి బీఆర్ఎస్ పార్టీకి షరతులతో కూడిన అనుమతిస్తూ గురువారం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. లగచర్లలో పోలీసులు వ్యవహరించిన తీరుపై నిరసనగా ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించ తలపెట్టిన శాంతియుత ధర్నాకు అనుమతి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకుడు వై మురళీధర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ శాంతియుతంగా ధర్నా చేయడానికి అనుమతి కోరినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందంటూ అనుమతి నిరాకరించినట్టు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి శాంతియుతంగా ధర్నాకు అనుమతించాలని అన్నారు. వెయ్యి మందిలోగా పాల్గొనాలని, నేర చరిత్ర ఉన్నవారు పాల్గొనరాదని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని ఆదేశించారు. షరతులు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవచ్చని చెప్పారు.

నిజాన్ని ఎదుర్కోలేక నిరాకరణ

- ప్రజాస్వామ్య హేళనకు ఇది నిదర్శనం
- రాజ్యాంగ స్వేచ్ఛను కాలరాస్తున్న రేవంత్ సర్కార్
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్‌లో శాంతియుత నిరసన కార్యక్రమానికి పోలీసులతో అనుమతి నిరాకరించడం అనేది అధికార దుర్వినియోగానికి, ప్రజాస్వామ్య హేళనకు నిదర్శనమని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకపోవటాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతను ఇది సూచిస్తున్నదని గురువారం ఎక్స్ వేదికగా విమర్శించారు. ఆధారం లేని కారణాలను చూపిస్తూ పోలీసు వ్యవస్థ పాలకులకు బానిసగా వ్యవహరిస్తూ రాజ్యాంగ స్వేచ్ఛను కాలరాస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇది ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్య కాదు. ఇది నిజాలు చెప్తున్న వారి గొంతు నొక్కడం, లగచర్లలో జరిగిన దుర్మార్గాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నాన్ని అడ్డుకోవడం, నిరసన తెలిపే హక్కుకు భయపడిన ప్రభుత్వం నిర్లజ్జగా, నిష్ఠూరంగా ఆందోళనలను అణచివేయడం' అని దుయ్యబట్టారు. 'ఇది పాలన కాదు. ఇదో నియంతృత్వం. శాంతియుత నిరసనకు అనుమతి నిరాకరణ, దానితోపాటు 5000 మందికిపైగా పోలీసులను మోహరింపచేసి అణచివేయడం ప్రజాపాలనకు తగిన విధానం కాదు' అని విమర్శించారు.

రుణం కోసం రాత్రి వరకు

వరంగల్ జిల్లా చెన్నారావుపేట పీఏసీఎస్‌లో స్వల్పకాలిక రుణాల కోసం రైతులు నానా పాట్లు పడాల్సి వస్తున్నది. రుణాలు ఇచ్చేందుకు గురువారమే చివరి రోజు కావటంతో రాత్రి అయినా రైతులు అక్కడే వేచి ఉన్నారు.

-చెన్నారావుపేట

పట్నం విడుదలైతే ప్రమాదమా?

- బయటకొస్తే ఆయన ఏం చేస్తారో చెప్పండి
- పారిపోనప్పుడు పార్కులో అరెస్టెందుకు?
- పెన్‌డ్రైవ్‌ను కోర్టు హాల్లో చూసే ప్రసక్తే లేదు
- మెడికల్ రిపోర్టులో క్వశ్చన్ మార్కులెందుకు?
- పట్నం కేసులో హైకోర్టు తీర్పు రిజర్వు

రెచ్చగొట్టే ప్రసంగం.. కేసు పట్నంపై కాదు: పీపీ

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): 'పట్నం నరేందర్‌రెడ్డి విడుదలైతే ఏం జరుగుతుంది? విడుదల చేస్తే ఆయన ఏం చేస్తారు? పట్నం పారిపోతారని చెప్పనప్పుడు అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? కేసు పెట్టాక సాక్ష్యాధారాల సేకరణ, ఆపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఎందుకు లేవు' అని హైకోర్టు గురువారం పోలీసులను నిలదీసింది. లగచర్లలో అధికారులపై దాడి కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి కింది కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణను కొనసాగించింది. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తున్న సమయంలో పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట జరిగిన విచారణలో పిటిషనర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. పోలీసులు కేబీఆర్ పార్కులో వాకింగ్ చేస్తున్న నరేందర్‌రెడ్డిని బలవంతంగా అరెస్టు చేశారని చెప్పారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ పార్కుల్లో అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమిటని పీపీని ప్రశ్నించారు. పారిపోతారనిగానీ, దర్యాప్తునకు సహకరించలేదనిగానీ పట్నంపై ఆరోపణలు లేనపుడు అంత హడావుడిగా పార్కుకు వెళ్లి అరెస్ట్ ఎందుకు చేయాల్సి వచ్చిందని నిలదీశారు.

పోలీసుల ద్వంద్వ నివేదికలు

నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన సమయాన్ని కూడా పోలీసులు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలని గండ్ర కోరారు. పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నరేందర్‌రెడ్డిని ఆయన ఇంట్లో ఉదయం 7 గంటలకు అరెస్టు చేసినట్టు ఉన్నదని, కానీ తొలి రిమాండ్ రిపోర్టులో జిల్లా శిక్షణ కేంద్రం (డీటీసీ) రూమ్‌లో ఉదయం 10.30 గంటలకు అరెస్టు చేసినట్టు పేర్కొన్నారని చెప్పారు. రిమాండ్‌లో ఉన్న నరేందర్‌రెడ్డి బయటకు వస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని పీపీ చెప్పారు. సాక్ష్యాలన్నింటినీ ముందుగా సేకరించి అరెస్టు చేయాలని, అలా చేయకుండా 11న కేసు నమోదు చేసి 13న అరెస్టు చేశారని హైకోర్టు ఆక్షేపించింది.

కేసు ఇల్లీగల్ అనడానికి ఆ ఒక్క డాక్యుమెంట్ చాలు

పట్నం బెయిల్‌పై విడుదలైతే దాని ప్రభావం కేసు దర్యాప్తుపై ఉంటుందని పీపీ చెప్పడాన్ని కూడా హైకోర్టు తప్పుపట్టింది. తమ ముందున్నది బెయిల్ కేసు కాదని గుర్తుచేసింది. దర్యాప్తులో తాము జోక్యం చేసుకోవడం లేదని స్పష్టంచేసింది. గ్రౌండ్స్ ఆఫ్ అరెస్టు, రీజన్స్ ఆఫ్ అరెస్టు.. ఈ రెండింటిపైనే సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్‌లైన్స్ అమలు కాలేదన్నదే పిటిషన్ అనే విషయాన్ని కూడా గుర్తెరగాలని చెప్పింది. 'కేసు దర్యాప్తు చేయవద్దని చెప్పడం లేదు. రిమాండ్ చట్టబద్ధంగా ఉందా లేదా అన్న అంశాన్ని మాత్రమే విచారణ చేస్తున్నాం. అరెస్టు చేసే ముందు అనుసరించాల్సిన విధానాలు అమలు చేశారో లేదో పరిశీలిస్తున్నాం. సుప్రీంకోర్టు డీకే బసు కేసులో జారీచేసిన మార్గదర్శకాలు ఏ మేరకు అమలు జరిగాయో తేల్చుతాం' అని చెప్పింది. దీనిపై పీపీ కల్పించుకుని, గ్రౌండ్స్ ఆఫ్ అరెస్టు పత్రంపై నరేందర్‌రెడ్డి ఎడమవైపు సంతకం చేశారని, మరోవైపు ఇంకొకరి సంతకం ఉందని చెప్పారు. ఇద్దరి సంతకాలు ఒకే పేపర్‌పై చేయించడం చెల్లదని, కేసు నమోదు ఇల్లీగల్ అని చెప్పడానికి ఆ ఒక్క డాక్యుమెంట్ సరిపోతుందని వ్యాఖ్యానించింది.

పిటిషనర్‌కు న్యాయపోరాటం చేసే హక్కు

పిటిషనర్లు కేసుల మీద కేసులు వేస్తున్నారని పీపీ చెప్పడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. గ్రౌండ్స్ ఆఫ్ అరెస్టు, రీజన్స్ ఆఫ్ అరెస్టు.. గురించి పట్నం కేసు వేశారు. కింది కోర్టులో బెయిల్ పిటిషన్ వేశారు. ఇంటి వంట కోసం మరో పిటిషన్ వేశారు. అరెస్టు చేసేప్పుడు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ అమలు చేయలేదని పట్నం భార్య మరో పిటిషన్ వేశారు. ఒకే ఘటనపై మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. ఇలా న్యాయపరమైన పోరాటం చేసే హక్కు వాళ్లకు ఉందని తేల్చిచెప్పింది. కేసులు వేయడంలో తప్పు ఏముందని నిలదీసింది. నిందితుడు బయటకు వస్తే.. అని పీపీ చెప్పగానే, తాము నిందితుడని కూడా అనడం లేదని గుర్తుచేసింది. బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇలాంటి ఇల్లీగల్ కేసుల వాదనల కోసం రూ.10 కోట్లు రిలీజ్ చేశారని పీపీ చెప్పగానే, ఆధారాలు చూపాలని అడిగింది. రిమాండ్‌ను రద్దు చేయడానికి వీల్లేదని, చార్జిషీట్ దాఖలు చేశాకే పిటిషనర్లకు కోర్టుకు వచ్చే హక్కులు ఉంటాయని పీపీ చెప్పారు. తమ ముందున్నది బెయిల్ పిటిషన్ కాదని మరోసారి హైకోర్టు తేల్చి చెప్పింది. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

ఇది ఇంకా వరెస్ట్!

నిమ్స్ సీఎంవో సుస్మిత ఇచ్చిన మెడికల్ సర్టిఫికెట్‌లో.. దాడిలో గాయపడిన అధికారులకు వైద్య పరీక్షల తర్వాత క్వశ్చన్ మార్క్ (ప్రశ్నార్థకం) ఎందుకు పెట్టారని హైకోర్టు ప్రశ్నించింది. గాయాలు చిన్నవో కాదో అనే ప్రశ్నార్థకాన్ని పెట్టారా అని ఆరాతీసింది. చిన్న గాయాలని ఎందుకు రాశారని కూడా ప్రశ్నించింది. చిన్న గాయాలు కాదని, ఫైనల్ ఒపీనియన్ సీరియస్ అని పీపీ చెప్పడంపై హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. 'ఇది ఇంకా వరెస్ట్..' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది.